క్లుప్తంగా

నోటుపుస్తకాలు, ప్యాడ్‌లు పంపిణీ

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన జంగారెడ్డి విద్యార్థులకు నోటుపుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. శుక్రవారం సమీక్ష, రాజేశ్వర్ రెడ్డి దంపతుల కుమారుడి పుట్టినరోజును ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు, పెన్సిల్లు నోటుపుస్తకాలు, ప్యాడ్‌లు పంపిణీచేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు జంగారెడ్డి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూర్మారావు, గ్రామస్తులు బుచ్చయ్య, సత్యంరెడ్డి పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మారుమోగిన దేవాలయం

- కనుల పండువగా సంగమేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం
- పట్టు వస్త్రాలతో ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు


ధ్వజస్తంభానికి పట్టు వస్త్రాలు, పూలు కడుతున్న వేదపండితులు

మొయినాబాద్ రూరల్: ప్రకృతి అందాలు, పంట పొలాల్లో వెలసిన శ్రీ సంగమేశ్వర స్వామి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పూజారులు, వేద పండితులు కలిసి విఘ్నేశ్వర స్వామి పూజ, గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభానికి పట్టు వస్త్రాలు, పూలు సమర్పించి స్తంభంపై జెండా ఆవిష్కరించారు. అనంతరం ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అగ్ని గుండాలు నిర్వహించారు. మొదటి రోజు దేవాలయంలో ఉత్సవాల సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులందరికీ స్వామి వారి దర్శనంతోపాటు తీర్థప్రసాదాలు, అన్నదానం చేపట్టారు. ఈ ఆలయ ప్రాంతం శివ నామస్మరణతో మారుమోగింది.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

- కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ నుంచి వినాయక స్టీల్ కూడలి వరకు జాతీయ రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు జే సుదర్శన్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలో విస్తరించిన ఈ రోడ్డుపై నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయని తెలిపారు. దీంతో జాతీయ రహదారి నుంచి ఆయా కూడళ్లకు వాహనాలు మలుపు తిప్పే క్రమంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతంలో పలుమార్లు ఎన్‌హెచ్‌ఏఐతో పాటు పలు శాఖల అధికారులకు సమస్య విన్నవించినా ఫలితం లేదన్నారు. గతేడాది వై జంక్షన్ నుంచి పెంజర్ల కూడలి వరకు వీధి దీపాలు ఏర్పాటు చేసినా ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రోడ్లతోనే గ్రామాల అభివృద్ధి

- ఎంపీపీ ప్రియాంక


పనులు ప్రారంభిస్తున్న ప్రియాంక

నందిగామ: రోడ్లు బాగుంటేనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఎంపీపీ ప్రియాంక హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లను నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, ఎంపీడీఓ సుమతి, గ్రామ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహా యాదవ్, సుధాకర్ రెడ్డి, గోవింద్ నాయక్, శివ కుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన కాసోజు ప్రమోద్ కూతురు తన్విశ్రీ గుండె ఆపరేషన్ నిమిత్తం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.2.5 లక్షలు ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ ఎల్‌ఓసీ చెక్కును తన్విశ్రీ కుటుంబ సభ్యులకు అందించారు.

ప్రారంభించారు.. వదిలేశారు!

- నిరూపయోగంగా ఎంపీడీఓ నూతన కార్యాలయం
- కొత్త భవనంలో కనిపించని ఫర్నిచర్
- బాత్‌రూముల్లో నీటి వసతి కరువు
- పాత భవనంలోనే కార్యకలాపాలు కొనసాగింపు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం


మధ్యలోనే వదిలేసిన సెప్టిట్యాంక్ పనులు

చేవెళ్ల: ఎంపీడీఓ నూతన కార్యాలయం ప్రారంభించారు. కానీ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోకుండా పాతకార్యాలయంలోనే విధులు కొనసాగిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. పేరుకే కొత్తభవనం అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవటంతో నిరూపయోగంగా మారింది. ఇది చేవెళ్లలో ఇటీవలే ప్రారంభించిన ఎంపీడీఓ నూతనకార్యాలయ భవనం పరిస్థితి. మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలోనే ఖాళీ స్థలంలో కొత్త భవనం నిర్మించారు. ఎన్నో ఏళ్ల తరబడి దీని నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. చివరకు నాలుగు నెలల క్రితం మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. ఎన్నికల కోడ్ వస్తుందని హడావిడిగా ప్రారంభించారు. అయినప్పటికీ అందులో సౌకర్యాలు కల్పించ లేదు. బయటి నుంచి చూస్తే అందంగా రంగులు వేసి ముస్తాబు చేశారు. కానీ అందులో నీటి వసతి కోసం ట్యాంకు ఏర్పాటు చేయలేదు. బాత్‌రూములకు సంబంధించిన పైపులైన్లు వేయలేదు. సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో అధికారులు కొత్త భవనంలోకి వేళ్లేందుకు వెనుకాడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే అసంపూర్తిగా భవనం..

ఈ భవన నిర్మాణ పనులు మొదలైనప్పటినుంచి కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లుగా కనిపించినా వారిని ఏమి చేయలేని దుస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ పనితీరుతో విసుగు చెందిన ఉన్నతాధికారులు టెండర్ రద్దు చేసినా మళ్లీ అతడే పూర్తి చేయిస్తానని ఒప్పించి టెండర్ దక్కించుకొని ఏళ్లతరబడిగా పనులు చేయించాడు. పనులు పూర్తి కాకముందే అధికారుల అలసత్వంతో భవనాన్ని ప్రారంభించారు. పెండింగ్ పనులను పూర్తి చేయించేవిషయంలో కాంట్రాక్టర్ ఎవరికీ అందుబాటులో లేదని సంబంధిత అధికారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



కొన్ని చిన్న, చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్డింగ్‌పై వాటర్ ట్యాంకు లేదు. బాత్‌రూమ్‌లకు సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్ లేదు. ఫర్నిచర్ సైతం లేని విషయం వాస్తవమే. ఈ విషయం గురించి కాంట్రాక్టర్ స్పందించకపోతే ఉన్నతాధికారులకు, ఏఈకి నివేదించాం. దీంతో వారు స్పందించి పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

– బి హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల

బదిలీ సర్వ సాధారణమే

- జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్


బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, ఎంపీపీ ప్రియాంక

నందిగామ: నందిగామ మండలంలో గత కొన్నేళ్లుగా ఎంపీడీఓగా బాల్‌రెడ్డి చేసిన పనులు ప్రశంసనీయమని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న బాల్‌రెడ్డికి శుక్రవారం ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ మాట్లాడుతూ నందిగామ మండల కేంద్రంగా ఏర్పాటైనప్పటినుంచి ఎంపీడీఓగా అతను తన విధులను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించి, అందరి మన్ననలు పొందారని గుర్తు చేశాడు. విధి నిర్వహణలో బదిలీ సాధారణమే ఐనప్పటికీ తమకు బాధగా ఉందని ఈట గణేశ్ అన్నారు. అనంతరం ఎంపీపీ ప్రియాంక మాట్లాడుతూ పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో ఉంటూ, ప్రభుత్వం సూచించిన విధులను ఎప్పటికప్పుడు పూర్తి చేశారన్నారు. బాల్ రెడ్డి సార్ సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం బాల్‌రెడ్డిని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, ఎంపీటీసీలు కుమార్ గౌడ్, కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, జేకే నర్సింహా, చిందం నర్సింహా, వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం


పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న అధికారులు

కొందుర్గు: మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో ఎంపీటీసీ మంజుల శుక్రవారం తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరాకు గతంలో కుంట సమీపంలో బోరువేశారన్నారు. కానీ పైపులైన్ ఏర్పాటుచేయకపోవడంతో గ్రామంలో నీటిసరఫరా చేయలేకపోయారు. ఈ విషయమై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లగా బోరుకు మోటార్ వేయించారు. పైపులైన్‌ఏర్పాటునకు రూ.3 లక్షలు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ లాలయ్య, పంచాయతీ కార్యదర్శి రాకేష్, మాజీ సర్పంచ్ జంగయ్య గ్రామస్తులు నర్సింలు, ఈశ్వరయ్య, గోపాల్ గౌడ్, మల్లేశ్ గౌడ్ పాల్గొన్నారు.

భయాన్ని వీడి.. ధైర్యంగా ఉండండి

షీ టీం ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి


అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

షాద్‌నగర్ రూరల్: బాలికలు భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు సాగాలని షీ టీం ఏఎస్‌ఐ గోపాల్ రెడ్డి సూచించారు. సైబరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు శుక్రవారం కమ్మదనం బాలికల గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత ఆధ్వర్యంలో షీ టీం బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. చదువుకునే దశలో వివాహాలు చేసుకొని తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. జీవితంలో అనుకున్నది సాధించి తమ కాళ్లపై తాము నిలబడినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు రద్దీ ప్రాంతాలలో అమ్మాయిలపై ఆకతాయిల వేధింపులు అధికంగా ఉంటాయని, వాటిని పసిగట్టి అలాంటి వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సమాజంలో బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురి చేసినా వెంటనే 1098 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం చేరవేయాలన్నారు. విద్యార్థినులు ప్రేమ పేరుతో మోసపోకుండా విద్యపైనే ఏకాగ్రతను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బిచ్చయ్య, సిబ్బంది ప్రహ్లాద్, డెబోరా మాక్సిన్, వైస్ ప్రిన్సిపాల్ రమ్యభార్గవి, అధ్యాపకులు శిరీష, శారద, జయలక్ష్మి, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంకు

- పట్టించుకోని అధికారులు


ప్రమాదకరంగా మారిన ట్యాంకు

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఆవరణలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన తాగు నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడుతూ కూలిపోయే దశకు చేరింది. ఎప్పుడు ఏం జరుగుతుందో అక్కడ భక్తులు భయాందోళన చెందుతున్నారు. దర్గా దర్శనం అనంతరం ట్యాంకు పరిసరాల్లో సేద తీరుతుంటారు. భారీ ఈదురు గాలులు, వర్షాలు కురిసినా ట్యాంకు కూలిపోయే ప్రమాదం ఉంది. గతంలో పలుమార్లు ట్యాంకును కూల్చివేయాలని అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దర్గా ఆవరణలో ప్రమాదకరంగా మారిన ట్యాంకును కూల్చి నూతన ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా

- జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి


షాబాద్: నగదు అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చర్లగూడ గ్రామానికి చెందిన కొత్తమాల సత్తయ్య(40) గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ శుక్రవారం చర్లగూడ గ్రామాన్ని సందర్శించి మృతుని భార్య లక్ష్మికి రూ.10వేల సాయం చేశారు. అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన కిందివనం సత్యం భార్య లతను పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పూజిత, పుష్పమ్మ, ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, రాంచందర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డిగూడ గ్రామంలో..

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూర మోని కిష్టమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా కుటుంబ సభ్యులకు దశదిన కర్మలకు రూ.10వేలను పంపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివయ్య, నర్సింలు, రవీందర్, యాదయ్య, పర్వతాలు, శివానంద్, బాలరాజ్, రాఘవేందర్, నాగరాజు, బాలరాజ్, వీరేశ్, కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

లాస్యనందిత మరణం పార్టీకి తీరని లోటు

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు


లాస్యనందిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

షాద్‌నగర్ రూరల్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కొందూటినరేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు పట్టణ ముఖ్య కూడలిలో లాస్యనందిత చిత్రపటానికి పూలమాలలువేసి ఘననివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్ ఈటగణేశ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అకస్మికంగా మృతి చెందడం బాధాకరమన్నారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొంది అందరి మన్ననలు అందుకున్న లాస్యనందితను రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో కబళించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, కౌన్సిలర్ కానుగు అంతయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నందకిషోర్, జూపల్లిశంకర్, శేఖర్, సుదీర్, రవియాదవ్, సాయిప్రసాద్‌యాదవ్, శ్రీకాంత్, రాఘవేందర్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

ఇబ్రహీంపట్నం: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు జంగయ్య మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. టీసీఎస్ ఎదురుగా కొందరు అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపుడుతూ మున్సిపాలిటీ నిధులకు గండికొడుతున్నారని తెలిపారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించకపోతే జిల్లా కలెక్టర్, సీడీఎంఏ అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


ఉపాధ్యాయులతో విద్యార్థులు

కడ్తాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడిగా చేతన్, ఆర్‌జేడీగా వెంకి, కలెక్టర్‌గా ప్రశాంత్, డిప్యూటీ కలెక్టర్‌గా సందీప్, డీఈఓగా శ్రీకాంత్, ఎంఎన్ఓగా సిద్ధార్థ్, ఎంఈఓగా రామ్‌రాజ్ వ్యవహరించగా, మరో 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్య వహరించి, తమ తోటి విద్యార్థులకు చక్కగా బోధించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రత్నమాల, రాఘవేంద్రచారి, పీడీ చంద్రమోహన్, కౌసల్య, శ్వేతామాధురీ, గోవర్ధన్, భాస్కర్‌రావు, జంగయ్య, మ ల్లయ్య, సునీత, శైలజ, శోభరాణి, హేమలత, రవి ప్రకాశ్‌రావు, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండలం అందుగులలో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ పద్మారెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో అందుగుల గ్రామానికి రూ.10లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు. అలాగే అందుగుల గ్రామ పరిధిలోని అంతంపేట రూ.5లక్షలు, కుభ్యతండాకి రూ.10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు రమేష్, శ్రీను, పర్వతాలు, అందుగుల రాజు, వెంకటయ్య, పెంటయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు భూమి కేటాయించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల వినతి


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధనరాజ్ గౌడ్, వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల ఈ పాఠశాలకు పీఎం శ్రీ పథకం క్రింద రూ.54 లక్షలు మంజూరయ్యాయని, ఇకనుంచి వరుసగా నాలుగేళ్లు ప్రతి ఏటా రూ.50లక్షలు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాల ఉన్న భవనం కేవలం 150 గజాల్లో మాత్రమే ఉందని, పాఠశాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని 2 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

తలకొండపల్లి: సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలు, తండాల అభివృద్ధికి కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్లకుంట తండాలోని పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

గాడ్గే సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అట్టడుగు కులాల అభ్యున్నతికి గాడ్గే చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బాబా గాడ్గే జయంతి పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ దొంతుల సురేశ్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గాడ్గే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో అంటరానితనం నిర్మూలన, మూఢనమ్మకాల బారి నుంచి సమాజాన్ని మేల్కొల్పడానికి గాడ్గే ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, చెక్కల శ్రీశైలం, శ్రీనివాస్ సాగర్, అందెమోహన్, సత్యం, రమణ, శేఖర్, దొడ్డి గోపాల్ నారాయణ్, రమేశ్, నక్క బాల్‌రాజ్, మాణిక్యం, దాసు, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించండి’


రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా కల్వర్టు

కొత్తూరు: తమ గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించండని మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామస్తులు అధికారులను కోరారు. తిమ్మాపూర్ నుంచి గ్రామానికి వచ్చే రోడ్డుపై తీగాపూర్ శివారులో సుమారు మూడు చోట్ల వాగులపై చిన్న చిన్న కల్వర్టులను నిర్మించారు. వాటికి ఇరువైపులా ఎలాంటి గోడలు నిర్మించలేదని వాపోయారు. నిత్యం ఈ రోడ్డుపై నుంచి వివిధ పాఠశాలలకు చెందిన బస్సులు, ఆటోలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. గతంలో ద్విచక్ర వాహన దారుడు పడి తీవ్ర గాయాలైన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.